

# కథా కౌముది

## సాక్షాత్కారం

కప్పగంతుల కిషోర్

పార్వతీపురం శంకరపల్లె గ్రామాల నడుమ కృష్ణానదీ పాయ. ఆ నది ఒడ్డున ఒక పురాతన శివాలయం. చుట్టూ పొలాలూ కొబ్బరి తోటలు. ఒక చిత్రకారుడు గీసినట్టు ఎంతో అందంగా హృద్యంగా ఉంటుంది.

గౌరీనాధశాస్త్రి ఆ శివాలయ పూజారి. తన తాత తండ్రిల నుంచి వంశపారంపర్యంగా వచ్చిన అర్చకత్వాన్ని ఎంతో చక్కగా నిర్వర్తిస్తున్నాడు. ఆయనది ప్రశాంత వదనం, మంచి విగ్రహం, శ్రావ్యమైన కంఠం, స్వచ్ఛమైన ఉచ్చారణ, శివుడిపై అపారమైన భక్తి, అచంచల విశ్వాసం. ఎల్లవేళలా శివ పంచాక్షరీ జపిస్తూ ఉంటాడు. అమ్మవారన్నా అంతే భక్తి. శ్రావ్యమైన గొంతుతో అన్నపూర్ణాష్టకం పాడుతుంటే దారిన వెళ్లే వాళ్ళు కూడా ఆగి వినాల్సిందే. గొంతులో మార్దవం, ఆర్తి, అపారమైన భక్తి,

నుదుట, బాహువులపై తీర్చిదిద్దిన విభూది రేఖలతో అపర సాంబశివుడిలా ఉంటాడని గ్రామస్తులు ఎంతో గౌరవంతో భక్తి ప్రపత్తులతో చూస్తారు.

గుడికి దగ్గర్లోనే నది ఒడ్డున పాతకాలం పెంకుటిల్లు. చుట్టూ పూలమొక్కలు, కాయకూరల పాదులు, బాదం, మామిడి, జామ, దానిమ్మ మొదలైన చెట్లు. రంగవల్లులతో తీర్చి దిద్దిన ముంగిలి. వసారాలో పడక కుర్చీలో కూర్చుంటే ఆమడ దూరంలో ఉన్న గుడి గోపురం కనిపిస్తూ ఉంటుంది.

గౌరినాధశాస్త్రి భార్య సుమతి, వారికి ఇద్దరు కొడుకులు ఒక కూతురు. వృద్ధురాలైన తల్లిని ఎంతో ప్రేమగా బాధ్యతగా చూసుకుంటూ ఉంటాడు. తమ్ముడు హరనాధ శాస్త్రిది ప్రక్క ఇల్లే.

ఉదయం ఆరుగంటల నుంచి పదకండు వరకూ, సాయంత్రం నాలుగు గంటలనుంచి ఎనిమిది వరకూ గౌరీనాధుడు గుడిలోనే. నిత్యపూజలు, అభిషేకాలు, భక్తుల కోరిక మీద చేయించే అర్చన అష్టోత్తర పూజలు, సాయంత్రం పురాణశ్రవణం, మంచి రోజు, వర్జ్యం, రాహుకాలం వగైరా అడిగినవారికి చెప్పడం. ఇది కాక నెలకొకసారో రెండుసార్లో, నామకరణం, అక్షరాభ్యాసం వంటి చిన్న చిన్న కార్యక్రమాలు గుళ్లో గౌరినాధ శాస్త్రి చేయిస్తూ ఉంటాడు.

గౌరినాథ శాస్త్రి జీవితం మూడు ముక్కల్లో చెప్పాలి అంటే శివుడు, శివాలయం, ఇల్లు అంతే.

ఎప్పటిలా ఉదయాన్నే నదిలో స్నానం అనుష్టానం కానిచ్చుకుని గుడికి వెళ్తున్న గౌరీ నాథుడ్ని చూస్తే పాలిపోయిన మొహంతో అన్యమనస్కంగా ఎదో కోల్పోయిన వ్యక్తిలా కనిపిస్తున్నాడు.

“నమస్కారం పంతులు గారూ” అని పలకరించిన స్కూల్ టీచర్ మాట గౌరీనాథుడి చెవిన పడినట్టు లేదు, ఎదో తీవ్రమైన ఆలోచనతో నడుస్తున్నాడు. అలవాటైన దారి, కాళ్ళు వాటంతటవే గుడి వైపు దారి తీస్తున్నాయి. గుడి చేరుకునే సరికి గౌరీనాథుడి తమ్ముడు హరనాథశాస్త్రి గుడి తెరిచి ప్రాగణం తుడిపిస్తున్నాడు. అన్నగారి రాకని గమనించి గర్భగుడి తలుపు తాళం తీసాడు.

గుడిలోకి రాగానే మొట్టమొదట దర్శనం చేసుకోకుండా ఏ పనీ చేయని గౌరీనాథుడి కాళ్ళు అప్రయత్నంగా గర్భాలయ గడపదగ్గరే ఆగిపోయాయి. లోపలి కి వెళ్లాలంటే ఎదో జంకు. తన గుండె వేగంగా కొట్టుకోవడం తెలుస్తూనే వుంది. లోపలి వెయ్యబోయిన అడుగు వెనక్కి తీసుకుని వెనుదిరిగిన అన్నగారిని ఆశ్చర్యంగా చూసాడు హరనాథుడు.

బయటకు వచ్చి ప్రాంగణంలో కట్టిన ఎండు మామిడాకుల మండని తీస్తూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు గౌరినాథశాస్త్రి. నిన్న జరిగింది కలా లేక నిజమా. కల కావడానికి వీల్లేదు. కళ్ళు మూసినా తెరిచినా కళ్ళముందు జరిగినదంతా రీలులా తిరుగుతోంది. నిజం అనుకోవడానికి మనస్కరించడం లేదు. మనసులో విపరీతమైన బాధ. అనేక సంవత్సరాలుగా కట్టుకొస్తున్న భవంతి కళ్ళముందు కుప్పకూలినట్టు గా అనిపిస్తోంది.

పడమట మండపంలో పిల్లలు లయబద్ధంగా చమకం వల్లెవేస్తున్నారు. కాసేపు నుంచుని ముందుకి కదిలి అలా గుడి చుట్టూ తిరిగి ప్రధాన ద్వారంలో గట్టు మీద కూర్చున్నాడు. మైకులో అన్నమాచర్య సంకీర్తనలు వస్తున్నాయి. తందనానా ఆహి తందనానా పురే తందనానా భళా తందనానా పాటని తనుకూడా పాడుతూ పూలూ, కొబ్బరి కాయలు అమ్మే మంగ బయట బండి మీద కొబ్బరి కాయలు అమరుస్తోంది.

“అన్నయ్యా ఆలస్యం అవుతోంది. అలా కూర్చుండి పోయావు?” అంటూ ఇత్తడి పళ్ళెంలో దీపారాధన కుందులు గంట ఏకాహారతి తీసుకువచ్చి పక్కనే కూర్చుని వాటిని శుభ్రంగా తుడవసాగాడు హరనాథ శాస్త్రి.

పరధ్యానంగా ఉన్న గౌరీనాథ శాస్త్రిని చూసి,

“కులాసాగానే వున్నావా అన్నయ్యా? నీకు ఎలావుందీ?” అని ప్రశ్నించాడు. “నాకు కాస్త నలతగా ఉందిరా, నేను ఇంటికి వెళ్తున్నా” అని క్లుప్తంగా సమాధానం ఇచ్చి లేచి బయటకు అడుగేసాడు గౌరీనాథ శాస్త్రి.

అన్నగారి ధోరణి కాస్త వింతగా అనిపించినా, ఏమోలే అని ఊరకుండిపోయాడు హరనాథుడు.

బయటకు వచ్చి, ప్రక్కనే ఉన్న కోనేరు గట్టు మీద కూర్చున్నాడు గౌరీనాథశాస్త్రి. కోనేటిలో నీరు నిశ్చలంగా ఉంది. అతడి మనసులో అలజడి.

అప్పటివరకు రావి చెట్టు చాటున ఉన్న సూర్య భగవానుడు పైకి రావటంతో, కోనేటిలో పడ్డ రవికిరణాలు, గౌరీనాధుడి మొహంలో ప్రతిబింబిస్తున్నాయి.

అసలు నిన్నేమి జరిగిందంటే ....

వసారాలో మంచం మీద పడుకున్న గౌరీనాధుడికి ఎవరో తట్టి లేపినట్టు మెలకువ వచ్చింది. సమయం రాత్రి పదకండు అయ్యిండొచ్చు.

పుచ్చపువ్వులా పండు వెన్నెల.

దొడ్లో విరబూసిన మల్లెల పై చంద్రకిరణాలు పడి తారల్లా మెరుస్తున్నాయి. చల్లగాలికి మామిడి చెట్టు త్యాగరాజకృతికి తాళం వేస్తున్నట్టు లయబద్ధంగా కదులుతోంది. ప్రకృతి పరిమళాలకి గౌరీనాధుడి మనసు పులకరించింది.

అప్రయత్నంగా లేచి మామిడి చెట్టు కింద ఉన్న నాపరాతి గట్టుపై కూర్చుని తదేకంగా చంద్రుడ్ని చూడ సాగాడు. ఆకాశంలో కదలాడే ఒక మబ్బు చంద్రుడి చెంతకురాగా, అందులో శంకరుడి జటా జూటం సాక్షాత్కరించింది గౌరీనాధుడికి.

ఇంతలో ఇంటివెనుక నుంచి ఎదో కదలిక, చిరుగంటల సవ్వడి!!! ఏదయినా ఆవా ?

ఈ సమయంలోనా? అసలు లోపలికి ఎలావచ్చి ఉంటుంది? అనుకుంటూ వెనక్కి వెళ్ళాడు.

దూరంగా వెన్నెల్లో ధగధగా మెరుస్తూ ఒక ఎద్దు!! కాదు కాదు. దైవకాంతులు వెదజల్లుతూ నందీశ్వరుడు.

అప్రయత్నంగా రెండు చేతులూ జోడించి మోకాళ్లపై ప్రణమిల్లాడు గౌరీనాధుడు.

బావున్నావా సాంబా? ఆప్యాయంగా బాగా తెలిసిన వ్యక్తిని పలకరించినట్టు అడిగాడు నందీశ్వరుడు. చిన్నతనంలో తనని, తన తాతగారు మాత్రం ఆలా పిలిచేవారు.

విస్తుపోయి చూస్తున్న గౌరీనాధుడిని నవ్వుతూ చూసి, “నిజమే మీ తాతగారు నిన్ను అలా పిలుస్తూ ఉంటే విన్నా” అన్నాడు నంది.

“నందీశ్వరా నువ్వు మా ఇంటికి వస్తూ ఉంటావా? నేనెప్పుడూ గమనించలేదే?” ప్రశ్నర్ధకంగా చూసాడు గౌరీనాధుడు.

“నీ లాగానే మీ తాతగారు కూడా గొప్ప శివభక్తుడు. అప్పట్లో వస్తూ ఉండేవాడిని. కాల చక్రంలో వచ్చిన మార్పులు, మారిన మనుషులు...

స్వార్ధంతో కూడిన భక్తి.

భుక్తి కోసం భక్తి – వృత్తి రీత్యా భక్తి .

పదవి కోసం భక్తి, పెదవులపైనే భక్తి.

కాలక్రమేణా, దైవలోకం నుంచి భూలోకానికి వచ్చేవారు అరుదైపోయారు. నేనూ రావడం మానేశా. నిజం చెప్పాలంటే, మీరందరూ అనుకునేట్టు భూలోకంలో వాతావరణానికన్నా ఎక్కువ కలుషితం అయిపోయింది మీ మానవ జాతే"... నిట్టూర్చాడు నందీశ్వరుడు.

"ఆకలితో నక నక లాడుతున్న ఈ దూడప్రాణాలు పోతుంటే, అలా చూస్తూ చూస్తూ వదిలేయ లేక, నీ దొడ్లో మేత చూపించటానికి వచ్చా. ఇదిగో నీ కంట పడ్డా. "

అప్పుడు గమనించాడు గౌరినాధ శాస్త్రి, ఆ వెనకే ఏమీ పట్టనట్టు అమాయకం గా పచ్చి గడ్డి మేస్తోంది ఒక లేగ దూడ.

ఇది కలా లేక నిజమా!! అర్ధం కాక అయోమయం తో చూస్తున్న గౌరీనాధుడ్ని నవ్వుతో చూసి,

"నిన్ను చూస్తే మీ తాతగారు విశ్వనాధ శాస్త్రిని చూసినట్టు వుంది" అని వారిరువురికీ ఉన్న సాన్నిహిత్యాన్ని వివరించాడు. ఆ మాటల సందర్భం లో, విశ్వనాధ శాస్త్రి గారి కోరిక కాదనలేక ఒక రోజు ఆయనని కైలాసం తీసుకువెళ్లడం, శివ దర్శనభాగ్యం కల్పించడం కూడా తెలియ పరిచాడు.

దానికి గౌరీనాధుడు, ఈ లేగ దూడ ఆకలికి అలమటించడం, అది నంది దృష్టికి రావడం, ఆ సమయంలో తనకి నందీశ్వర దర్శన భాగ్యం కలగడం కేవలం ఈశ్వర సంకల్పం అని, ప్రాధేయ పడి, నందితో కైలాసం ప్రయాణం అయ్యాడు.

వట్టి చేతులతో వెళ్లడం ఇష్టం లేక, చేతికి అందిన కొన్ని జామ పళ్ళు, దానిమ్మ పళ్ళు, చెట్లనుంచి కోసి ఉత్తరీయంలో మూటకట్టి తీసుకున్నాడు గౌరినాధ శాస్త్రి.

అతడి మొహంలో ఆనందం, ఉద్విగ్నత మిళితమై కొత్త కాంతులు విరజిమ్ముతోంది. ఇన్ని నాళ్ళ తన తపస్సుకి ఈశ్వరుడి అనుగ్రహం లభించి అమ్మవారితో సహా ఆయన దర్శనం కాబోతోంది అని అనుకున్నాడు.
మనసు పరిపరి విధాల పోతోంది అని గ్రహించి శివ పంచాక్షరి జపం మొదలు పెట్టాడు.

కొంత సేపటికి కైలాస ముఖద్వారానికి చేరుకున్నారు. నందితో రావడం చేతనేమో శివ భటులు అడ్డగించకుండా లోపలి పంపించారు.

తన ఊహ ప్రకారం మంచు కొండ దిగువలో, విశాలమైన ప్రాంతం, చదునైన ఒక చిన్న రాయి.

రాతిపై పరచిన పులి చెర్మం. దానిపై ధ్యాన ముద్ర లో పరమ శివుడు, పక్కనే పార్వతి దేవి.

మరి వినాయకుడు ఉంటాడో లేదో?

తను అక్కడికి చేరుకోగానే, అరమోడ్పు కళ్ళతో చిరునవ్వుతో "వచ్చావా గౌరినాధా, నీకు నాపై ఉన్న భక్తి ఎంతో శ్లాఘనీయం" అని ప్రశంసిస్తాడు అని అనుకుని, మరీ ఇంత దురాశగా ఎలా ఆలోచిస్తున్నాను? నాకన్నా గొప్ప భక్తులు

ఎంతమంది ఉంటారు. శివ దర్శనం చాలు ఈ జన్మకి అనుకునే నేను, శివ సాక్షాత్కారం ఖాయం అయేసరికి, ఇలా ఆశిస్తున్నానా? పరమ శివా నన్ను మన్నించు.. నీ దర్శన భాగ్యం ప్రసాదించు చాలు... అని మనసులోనే వేడుకున్నాడు. గౌరీనాధుడి మోహంలో కదలాడే భావాలు గమనించి నందీశ్వరుడు నవ్వుకున్నాడు.

కానీ, తన ఊహకి విరుద్ధం గా, ఒక విశాల స్వర్ణ సౌధం దగ్గరకి తీసుకు వచ్చాడు నందీశ్వరుడు.

“ఇదే శివ సౌధం, ఇంక ఇక్కడితో నా పని పూర్తి. శివ దర్శనం కాగానే, నన్ను స్మరించు గౌరీనాధా, నిన్ను మీ ఇంట దింపుతాను” అని గౌరీనాధుడి సమాధానం కోసం ఎదురు చూడకుండా అంతర్ధానం అయ్యాడు.

అప్పటివరకూ నందీశ్వరుడి చెంత ఏ చీకూ చింతా లేకుండా భూలోకం నుంచి కైలాసం వరకూ ప్రయాణించిన గౌరీనాధుడికి ఒక్కసారిగా ఒంటరివాడైపోయినట్టు అనిపించింది. ఇప్పుడు శివ దర్శనం ఎలా? ఇంత పెద్ద సౌధం లో మరి శివయ్య ఎక్కడవుంటాడో ఎలా తెలిసేది? శివ దర్శనం చేయిస్తానని చివరలో ఇలా వదిలేసి వెళ్లిపోయాడేమిటి నంది? మొదటి సారి పాఠశాలలో తల్లి తండ్రులు వదిలేసి వెళ్ళిపోయాక బిక్కు బిక్కు మంటూ బిత్తర చూపులు చూసే పిల్లాడి మాదిరి వుంది నా పరిస్థితి... అనుకుంటూ, భయం భయంగా శివాలయంలో అంటే శివ సౌధంలో అడుగుపెట్టాడు గౌరీనాధుడు.

కొంత లోపలి వెళ్ళాక అక్కడ కనిపించారు ద్వారపాలకులు. ఆజాను బాహులు, కనీసం ఏడు అడుగులు ఎత్తు ఉంటారేమో. మరి వీళ్ళు నన్ను లోపలికి పంపిస్తారో లేదో అని సందేహిస్తూ ముందుకి అడుగులేసాడు. గౌరీనాధుడిని చూసి వారు, నందీశ్వరుడు నీ కబురు మాకందించాడు, కానీ నీవు కొంత సేపు వేచి ఉండాలి అని పక్కనే కూర్చో పెట్టారు. వారి గాంభీర్యం చూసి, మారు ప్రశ్న వేయక, నుదుట పట్టిన చిరు చెమట తుడుచుకుని శివ పంచాక్షరీ జపిస్తూ కూర్చున్నాడు.

మరి కొద్ది సేపటికి ఒక ద్వారపాలకుడు వచ్చి, మీరు లోపలికి వెళ్ళవచ్చు, కుడివైపు నుంచి లోపలికి వెళ్లి నేరుగా ౩౦ అడుగులు వేసాక బయటకి దారి ఉంటుంది. అందులోనించి బయటకి వెళ్ళగానే మీకు ఒక పాలరాతి మండపం కనిపిస్తుంది. అక్కడికి వెళ్లి వేచి వుండండి, అక్కడే మీకు శివ దర్శనం!! అని లోపలి పంపించాడు. కొంత భయము, కాసింత ఉద్విగ్నత, పట్టరాని ఆనందము అన్నీ కలగలిసిన భావాలతో పాలరాతి మండపం చేరుకున్నాడు.

ఎంతో ప్రశాంతం గా ఉంది ఆ మండపం. అది వేణూ నాదమా? కాదే, వీణా నాదమా !!

రెండూ కలగలిపితే బహుశా ఇలా ఉంటుందేమో, ఎంతో శ్రావ్యంగా వుంది.

దూరంగా పారే సెలయేరు, దాని సవ్వడి శివ గద్యంలా వినిపిస్తోంది. అతడి మనసు ఒక అనిర్వచనీయతకి లోనయ్యింది.

మరి కొద్ది సేపటికి ఇందాక దారి చెప్పిన ద్వారపాలకుడు వచ్చి,

"మీరు ఇంకా ఇక్కడే ఉన్నారా!? మీకు చెప్పిన మండపం ఇది కాదు" అని వచ్చిన దారిన వెనక్కి తీసుకుని వెళ్లి ఇంకో ద్వారం నుంచి బయటకి పంపాడు. అక్కడ కూడా ఇంకో పాలరాతి మండపం. ఇది మరింత పెద్దగా వుంది. ఆ మండపంలో శివుడూ– పార్వతీ కూర్చుని వున్నారు. ప్రక్కనే వినాయకుడు.

పట్టరాని ఆనందంతో, ఉప్పొంగిన భక్తితో చూసాడు. మండపం బయటనుంచే రెండు చేతులూ జోడించి అప్రయత్నంగా శివ నమస్కార మంత్రం – "నమః శంభవేచ మయోభ వేచ నమః శంకరాయ చ నమః శివాయచ శివతరాయచ" అని చదువుతూ ప్రణామం చేసాడు.

శివ పార్వతులు ఇతని ఉనికిని గమనించనట్టు వారి సంభాషణలో వారున్నారు. వినాయకుడు వారి సంభాషణ దీక్షగా వింటూ వారి దగ్గరే నుంచుని వున్నాడు.

అంత పెద్ద మండపంలో దూరంగా కూర్చుని వున్నారని గ్రహించి, మండపంలోకి ప్రవేశించి వారి వైపు అడుగేసాడు. అప్పటివరకు ఇతని రాకని గమనించని శివ పార్వతుల దృష్టి గౌరీనాథుడిపై పడింది.

ఇంతలో ఎక్కడినుంచి వచ్చాడో తెలియదు కానీ, ఒక శివ భటుడు వచ్చి, "లోపలికి ఎలా ప్రవేశించావయ్యా నువ్వు? మండపం బయట వరకే నీకు ప్రవేశం! ముందు బయటకి పద" అని గదమాయించాడు.

దానికి నివ్వెరపోయి రాయిలా నుంచుండి పోయిన గౌరీనాథుడ్ని, "నువ్వు కదుల్తావా? లేక..." అని గద్దించబోయిన భటుడ్ని శివుడు వారించి,

"గౌరీనాథా! ఇలా లోపలికి ప్రవేశించడం తప్పు, దూరం నుంచే దర్శనం" అనగానే, అపరాధ భావంతో తలవంచుకున్నాడు.

"నీకు నాపై ఉన్న అపార భక్తి నాకు తెలుసు" అనగానే, ఆనందంతో తలఎత్తి, రెండు చేతులూ జోడించి మెల్లగా అడుగులు వెనక్కి వేసి, మండపం బయట నుంచున్నాడు.

ఇంతలో శివుడి జటాజూటం నుంచి గంగాజలం ధారగా మండపంలో నలుదిశలా పడసాగింది. శివుడు తల ఎత్తి పైకి చూసాడు. గంగాధార ఆగిపోయింది. ఆహా!! శివ పార్వతులే కాక గంగమ్మ దర్శనం కూడా కలగడం ఎంత భాగ్యం అనుకున్నాడు. శివుడు మండపపు మెట్లవరకు వచ్చాడు. వెనకే పార్వతి వినాయకుడు కూడా వచ్చారు.

"సాంబశివా నీ దర్శన భాగ్యం కలిగింది, అన్నపూర్ణేశ్వరీ నా జన్మ ధన్యం. ఈ పేద బ్రాహ్మడు నీకు ప్రసాదం గా తీసుకువచ్చిన ఈ పళ్ళు స్వీకరించు" అని ఉత్తరీయం లోనించి జామ పళ్ళు, దానిమ్మ పళ్ళు తీసి ఇవ్వపోయిన గౌరీనాథుడికి అలా క్రింద పెట్టు అని చేయి చూపించింది పార్వతి దేవి. ముందుకి అడుగు వేసి మెట్ల చివర పార్వతి దేవి చూపించిన చోట ఆ పళ్ళు తీసి పెట్టి, వెనక్కి వెళ్ళాడు. వెళ్లిన వెంటనే, శివుడు తల తిప్పటం మళ్ళీ గంగ అతడు నడిచిన చోట ధారగా పడటం గౌరీనాథుడు గమనించాడు. ఇంతలో వినాయకుడు, తన తొండంతో అక్కడ పెట్టిన జామపండు

తీసుకోపోగా, పార్వతీదేవి చేయి గణేశుడి భుజం మీద వేయడం, వెంటనే వినాయకుడు తొండం వెనక్కి తీసుకోవడం అతని దృష్టిని దాటి పోలేదు.

"ఇక బయలుదేరు గౌరినాధా, నీకు అంతా శుభమే జరుగుతుంది" అని శివ పార్వతులు దీవించారు. మరొక్కసారి, ముగ్గురికీ చేతులుజోడించి నమస్కరించి అక్కడినుంచి నిష్క్రమించాడు. తన వెనకే, నడిచిన దారిని శుద్ధి చేస్తూ ఇద్దరు శివ సేవకులు రావటం గౌరీనాధుడికి తెలుస్తూనే ఉంది.

ఇందాక తను వేచి వున్న పాలరాతి మండపాన్ని ఒక నలుగురు శుభ్రం చేస్తూ కనిపించారు.

ఏ కులంలో పుట్టినా, ఎన్ని పూజలు చేసినా, చివరకు నేను ఒక అల్ప మానవుడ్నేకదా,

మనిషికీ మనిషికీనే మనము ఇన్ని వర్గాలూ తరగతులూ సృష్టించుకుంటే, మరి దేవుడికీ మనిషికీ ఎంత వ్యత్యాసం ఉండాలి?

ఎంత సరిపెట్టుకున్నా, మనసులో ఎదో ముల్లుగుచ్చుకున్నట్టుగా ఉంది.

నందితో జంటగా వచ్చాను.

తరువాత కొంత సేపే అయినా వంటరి వాడినయ్యా.

ఇప్పుడు అంటరాని వాడిగా వెనక్కి వెళ్తున్నా!?!

తిరుగు ప్రయాణంలో మనసులో అనేక ఆలోచనలు. గుండెలో ఎదో తెలియని బాధ...

"శాస్త్రిగారు అపర సాంబశివుడే"

"గురువు గారూ అభిషేకం మీరే చెయ్యాలి"

"మా అబ్బాయికి పేరు మీరే పెట్టాలి "

" సామీ నాకు పూజలు మంత్రాలు రావు, నువ్వే ఆ దేవుడికి చెప్పి నా కట్టాలు తీర్పించాలి"

అతడి చెవిలో రక రకాల మాటలు రొదచేస్తున్నట్టు తిరుగుతున్నాయి.

ఎప్పుడు వచ్చాడో ఎలా వచ్చాడో తెలియదు. వచ్చి దిగులుగా నిస్త్రాణగా పడుకుని నిద్రలో జారుకున్నాడు.

పూల కొట్టు మంగ కొడుకు ఆడుకుంటూ, ఒక చిన్న రాయిని కోనేటిలోకి విసిరాడు. అప్పటి వరకూ నిశ్చలంగా ఉన్న నీళ్లు చెల్లా చెదురు అయినాయి,

గౌరీనాధుడు నిన్నటి ఆలోచనలనించి బయటపడ్డాడు.

నిజంగా తనను బాధించింది ఏమిటి? వారికీ తనకూ వున్న భేద భావం! అంటరాని తనం!! వాళ్ళు చూపించారో లేదో కానీ తనకి ఆలా అనిపించింది. గుళ్లో తనకీ రాతి లింగానికి ఉన్న అవినాభావ సంబంధం, నిజంగా శివుడితో ఉన్న బంధంగా తాను పెట్టుకున్న నమ్మకం, తీరా ఆ దేవుడే కట్టెదుట ప్రత్యక్షంగా నుంచున్నప్పుడు, ఆ అవినాభావ సంబంధం కంటే వ్యత్యాస భావమే ఎక్కువ అనిపించింది!!! ఎందుచేత ?

మట్టితో, రాతితో మనకు నచ్చిన రూపం మనమే దేవుడిగా మలిచి, ఆ దేవుడిపై మనవే పూర్తి హక్కులూ అధికారం అనుకుని, మనకు నచ్చిన బట్ట కట్టి, శక్తి కొద్దీ నగలతో పూలతో అలంకరించి, తోచిన (మనకిష్టమైన?) నైవేద్యం పెట్టి దాన్ని మనమే ఆరగించి తృప్తి చెందుతాం. ఇందులో దేవుడి ప్రమేయం లేనే లేదు. దేవుడి చేతిలో మనం ఆట బొమ్మలం అని అంటూనే, దేవుడ్ని ఒక ఆట బొమ్మ చేసి ఆడుకుంటూ, అదే భక్తి, ఆచారం అన్న భ్రమలో ఉంటాం. ఇది ఎంత హాస్యాస్పదం?

ఇన్ని తెలిసీ, ఇంత తార్కికంగా ఆలోంచించగలిగే తనని బాధించేది ఏమిటి? అతడి ఆలోచనలు ఇలా సాగుతున్నాయి...

నిజం చెప్పాలంటే, తను చేసేదేమిటి?

తన ఇంటికి వచ్చిన వారిని తన ఇంటి గుమ్మం బయటనించే పంపించేస్తాడు, తను వసారాలో కుర్చీలో కూర్చుంటే, వచ్చిన వాళ్ళు నాలుగు మెట్ల కింద నుంచుని మాట్లాడి వెళ్ళి పోతారు.

కమ్మరీ, కుమ్మరీ లేదూ, మంగలివారు వీధి గుమ్మంలో నుంచుంటే, తను లోపల్నించి వారికి కావాల్సిన ముహుర్తమో , మంచి రోజో, పేరో పంచాంగం చూసి చెప్తాడు. అడక్కపోయినా వాళ్లెవరన్నా పళ్ళో దక్షిణో ఇస్తే, నీళ్ళు జల్లుకు తీసుకుంటాడు.

వేళ కాని వేళ ఎవరైనా వస్తే, నిర్మోహమాటంగా పంపించేస్తాడు కానీ, వారి మొహం చూడడు కదా!!

గుడి గర్భాలయం లోకి ఎవరికీ ప్రవేశమే లేదు కదా?

మరి వారి అనుమతి అనుకూలం ఏమీ కనుక్కోకుండా, తను తగుదునమ్మా అని సరాసరి కైలాసం ప్రయాణం కట్టడం ఎంతవరకూ సబబు?

అతడి మనసు పరిపరి విధాలు ఆలోచిస్తోంది.

ఆలోచించిన కొద్దీ, మంచు పొరవీడుతున్నట్టు అనిపిస్తోంది. ఇంతలో, గౌరీనాధుడి భార్య సుమతి, "ఏమండీ! మీరు ఇక్కడున్నారా? ఎంత ఖంగారు పడ్డానో మీకోసం!!" అంటూ హరనాధ శాస్త్రితో వచ్చింది.

మరిదిని చూస్తూ – "మీ అన్నయ్య తెల్లవార్లూ మూసిన కన్ను తెరవలేదు, నూట మూడు జ్వరం. మనిషి కలవరింతలు!! ఏదో మాట్లాడుతూనే ఉన్నారు. తెల్లవారు ఝూమున కాస్త తగ్గింది. లోపల పడుకునే ఉన్నారని అనుకుని నేనేదో నా పన్లో ఉన్నా, తీరా చూస్తే ఇంట్లో లేరు. ఖంగారు పడ్డా. గుళ్లో ఉన్నారేమో చూద్దాం అని ఇలా వచ్చా".
ఆయాస పడుతూ చెప్పింది.

"చెప్పలేదేం అన్నయ్యా? విశ్రాంతి తీసుకోకుండా ఎందుకొచ్చావు!!" అని నుదిటిమీద చెయ్యి వేస్తూ అడిగాడు.

గౌరీనాధుడికి భార్య మాట వినగానే, ఇప్పుడు మరింత స్పష్టత వచ్చింది.

రాత్రి నాకు కలిగింది శివసాక్షాత్కారం కాదు. ఆత్మ సాక్షాత్కారం!!! తోటి మనిషినుంచి దూరమయ్యి దేవుడికి దగ్గరవుతున్నా అనుకున్నా. ఎంత అల్పమైన ఆలోచన. కోనేటిలో తామర పువ్వులు అతడిని అభినందిస్తున్నట్టు తలలు ఊపుతున్నాయి.

భార్యతో కలిసి ఇంటికి బయలు దేరాడు.

ఎప్పటిలా చుట్టుతిరిగి ఇంటికి వెళ్లకుండా కుమ్మరి వీధిలోంచి దారి తీసిన భర్తని ఆశ్చర్యంగా చూసింది భార్య. ఎప్పుడూ గాంభీర్యంగా ఉండే అతని మొహంలో ఏదో కొత్త కాంతి, మునుపెన్నడూ లేని ప్రశాంతతా కరుణ. “మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి ఒకటే – చండాలుడుండేటి సరి భూమి ఒకటే” ... దూరంగా మైకులో అన్నమాచర్య కీర్తన ఇంకా వస్తోంది.

★★★

# COMMENTS